"నేనెందుకండీ వూరుకోవాలి....నేనేమన్నా నని. మాటకి ముందు నా నోరు మూయిస్తారు మీరు. మొగుడికి లోకువయితే ముష్టివాడికీ లోకువే-అవిడకి అందుకే లోకువయ్యాను, ఇంట్లో దాసీదానిలా చాకిరి చేస్తున్నా సాధింపులు....''

"మా తల్లే, లోకువచేసి నిన్నెవరేం అంటు న్నారే తల్లీ–ఆమాత్రం పెద్దరికం ఈ కొంపలో నాకెక్కడేడిసిందే....ఏదో చావలేక యిలా మూల పడి వుంటున్నాను కొంపలో. అయినా యిన్ని మాటలంటున్నావు....''

"అవును మూల కూర్చునే యింత సాధిస్తే నీవే చెప్పు. నా ఖర్మకని యిలా మీ యింట్లో పడి వున్నాను....'' కళ్ళొత్తుకుంది పార్వతమ్మ.

"చెప్పండి చెప్పండి చాడీలు కొడుక్కి. తిండి కూడా పెట్టకుండా సాధించి తిట్టి చంపుతున్నానని చెప్పండి...'' ప్రభ గంయ్‌మని లేచింది.

"ప్రభా నీవు నోరు మూసుకుని యింక చాలించు. లోపలికి వెడతావా....నా మొహాన కాఫీ నీళ్ళన్నా తగలేస్తావా లేదా...'' తల పట్టుకు కుర్చీలో కూలబడి అరిచాడు శర్మ.

"పెళ్ళాం నోరు మూయించడం ఒక్కటేగా మీకు చాతనయింది.'' ఉక్రోషంగా మూతి తిప్పి బెంచి మీద కూర్చుంటూ.

శర్మ శుష్కహాసం చేశాడు. "నీవడగబోయేది తెలుసు సుధా, గుమ్మంలో అడుగు పెట్టగానే అత్తా కోడళ్ళ తగువు విని వుంటావు. రోజూ యిదే వరస కొంపలో....గుమ్మంలో అడుగు పెట్టేసరికి ఏదో కంప్లైంట్ రోజూ. ఎవరిని ఏమన్నా కోపం– రాగాలు శోకాలు గట్టిగా ఏదన్నా అంటే. యిద్దరి మధ్య ప్రాణం విసిగిపోతూంది. పెద్దావిడ పోనిలే అని ఈవిడ వూరుకోదు, తన పెద్దరికంతో చూసీ చూడనట్టు గౌరవం నిలుపుకోదు అమ్మ. యిటు తల్లి, అటు భార్య, ఎవరిని అనను. ఛా....ఎన్ని.

# సహజీవనానికి సోపానాలు

— డి. కామేశ్వరి

న్నారు.''

"అమ్మా....ప్రభా వూరుకుంటారా మీరిద్దరూ దయచేసి లేకపోతే కొంపలోంచి పొమ్మన్నారా నన్ను చెప్పండి. ఛా....గుమ్మంలో కాలుపెట్టడం తరువాయి వెధవగోల ఆరంభం. ఒక్కక్షణం హాయిగా వుండనీరు. అమ్మా నీకెన్నిసార్లు చెప్పాను పెట్టిందేదో తిని హాయిగా క్రిష్ణా రామా అనుకుని కూర్చోమని. అన్నింట్లో నీవెందుకు కల్పించుకుంటావు, దాని యిల్లు దానిష్టం, ఏం చేసుకుంటుందో దానిష్టం....''


"అనరా నాయనా నీవూ నన్నే అను, దాని యిల్లు నీదేం కాదని నా మొహాన్నే తెగేసి చెప్తున్నావు. ఇది నా యిల్లు కాదు. అవునురా బాబూ గతిలేక మీ యింట్లో పడి వుంటున్నాను ఏదో పెద్ద ముండని అనాచారపు పనులు చూడలేక, గిన్నెలు తొలవకుండా లోపల పెడ్తుంటే అదేమిటే అన్నాను అంతే నాయనా నా అపరాధం – తిని మూల కూర్చో అంటావు, కూర్చుంటే నీ పెళ్ళాం "అంతా రాణీలే కొంపలో నేనే దాసీదాన్ని''అంటూ నీవలా గుమ్మం దిగగానే సాధింపు మొదలు పెడ్తుంది. ఏదన్నా పని సాయానికి వెడితే వెళ్ళం దవతలకి అని కసిరికొడ్తుంది. ఎలా చావమన్నావో విన విన వెళ్ళింది ప్రభావతి.

"శర్మా!'' రెండు నిమిషాలబట్టి గుమ్మంలో నిలబడి లోపలి భాగోతం వింటూ ఎలా పిలవడమో నని తటపటాయిస్తున్న సుధాకర్ యింకా వింటూ నించోడం సభ్యత కాదని లోపలికి అడుగువేసి పిలిచాడు. గతుక్కుమన్నాడు శర్మ. మొహంలో భావం చటుక్కున మార్చేసి, 'రా....రా' అంటూ ఆహ్వానించాడు. 'ప్రభా యింకో కప్పు కాఫీ పట్రా సుధాకర్ వచ్చాడు' అని పిలిచాడు. ప్రభావతి కప్పులతో వచ్చి, 'ఒక్కరే వచ్చారేం, సునందనీ తీసుకు రావల్సింది' అంటూ నవ్వుతూ పలకరించింది.

"అనుకుని బయలుదేరలేదండి, పని మీద యిటు వెడ్తుంటే గుమ్మంలో వీడి స్కూటరు కనిపించి యింటికొచ్చి వుంటాడని వచ్చాను'' అన్నాడు సుధాకర్.

"పదరా అలా కాసేపు తిరిగి వద్దాం'' కాఫీ ముగించి లేస్తూ అన్నాడు శర్మ. "అలా కాసేపు టాంక్‌బండ్ మీద కూర్చుని వద్దాం.''

మిత్రులిద్దరూ నడుచుకుంటూ టాంక్‌బండ్ వైపు వెళ్ళారు. "శర్మా ఒక్క విషయం అడుగుతాను ఏమనుకోవు గదా'' అన్నాడు సుధాకర్ ఓ ఖాళీ




యుగాలయినా యీ అత్తాకోడళ్ళ దెబ్బలాటలు పోవు గాబోలు,'' విరక్తిగా అన్నాడు శర్మ.

"తప్పు వాళ్ళిద్దరిదే అంటావా...నీ తప్పు ఏం లేదంటావా ?''

"నా తప్పా? మధ్య నేనేం చేశాను.'' ఆశ్చర్యంగా అన్నాడు శర్మ.

"చూడు, యింట్లో యిద్దరాడవాళ్ళు, యిటు తల్లి, ఆటు భార్య. మనకిద్దరూ కావల్సిన వాళ్ళే కాని వాళ్ళిద్దరిలో వాళ్ళకి నేనెక్కువ, నే తక్కువ అన్న అభిప్రాయం వాళ్ళకి రాకుండా చేయడం మన బాధ్యత అంటాను నేను. పెళ్ళవగానే యీ యిల్లు నాది, పెత్తనం నాది అని భార్య అనుకోక ముందే, నా తల్లికి యీ యింట్లో స్థానం వుంది, ఆవిడ పెద్దరికాన్ని ఆవిడ వున్నన్ని రోజులు నీవు గుర్తించి గౌరవించాలి అని తెలియజేసే బాధ్యత మగవాడిదంటాను నేను. అలాగే భార్య పైయింటి నించి అందరిని వదులుకుని నా కోసం వచ్చింది. అత్తగారిలో అమ్మని చూసుకునేటట్టు ప్రవర్తించాల్సిన బాధ్యత తల్లిదని ఆమె గుర్తించేట్లు చెయ్యాలి...నిజమే పెళ్ళయ్యాక మగవాడి జీవితంలో భార్య స్థానం పెద్దదే, కాని ఆ సంగతి సున్నితంగా తల్లికి అర్థం అయ్యేట్లు నెమ్మది నెమ్మదిగా మార్చాలి.''

"బావుంది. యిదంతా వాళ్ళకి తెలియదంటావా...మనం చెపితే మాత్రం వాళ్ళ బుర్రలకి ఎక్కుతుందా అసలు. మాటలకి చింతకాయలు రాల్తాయా...!''




"తలకెక్కించేట్లు చెయ్యడంలోనే వుంది మగవాడి చాకచక్యం. ఎంత చదువుకున్న ఆడదైనా, అత్తగారు కాంగానే, ఎంత సంస్కారం వున్నా కోడలు రాగానే కొడుకు తనకి దూరమైపోయాడని బాధపడ్తుంది. అలాంటి భావం అసలు కలగడానికి మన మగవాళ్ళమే కారణం అంటాను - పెళ్ళాం రాగానే, ఆడగాలి సోకగానే ఆ కొత్త మోజులో సర్వం మర్చిపోయి పెళ్ళాం కొంగుపట్టుకుని యిరవైనాలుగ్గంటలు తిరుగుతాం—ఆవిడ లేందే మనకింక ప్రపంచమే లేనట్టే ప్రతి చిన్నదానికి ఆవిడ మీద ఆధారపడి పోతాం. అంతవరకూ 'అమ్మా కాఫీ...అమ్మా అన్నం పెట్టు, అమ్మా బట్టలుతికించావా, అమ్మా నా తలకి నూనె రాయవూ' అనే మనం ఒక్కరోజులో తల్లి అనే ఆమె వున్నట్టే మర్చిపోయి హఠాత్తుగా భార్యవైపు తిరిగిపోయి భార్యతో చేయించుకుంటాం ఆ పనులు. అదేం అసహజం అనను నేను. కానీ హఠాత్తుగా యీ మార్పుని ఏ తల్లీ తట్టుకోలేదు. కాస్త స్థిమితంగా ఆలోచించితే ఆ తల్లిపడే ఆవేదన అర్థం అవుతుంది. కొడుకు ఒక్కసారిగా కోడలి వైపు తిరిగి పోయాడన్న బాధ ఉక్రోషంగా మారి కోడలిపట్ల కసిగా మారుతుంది. కొన్నాళ్ళకి కాస్త శాంత స్వభావురాలైన తల్లి అయితే మాటలతో బయట పడిపోదు. నాలుగు రోజులుండి పోయే వారయితే చూసి చూడనట్లు వూరుకుంటుంది. తల్లి, భార్య ఒకే ఇంట్లో వుండవల్సిన వారయితే కోడలిపట్ల అసూయ క్రమంగా నిప్పు రాజుకోడం ఆరంభిస్తుంది. ఆ నిప్పు రాజుకోక ముందే మనం జాగ్రత్త పడాలంటాను నేను.''

"ఏం చెయ్యాలంటావు. మీ ఇంట్లో మీ అమ్మగారు మీ ఆవిడ ఎప్పుడూ దెబ్బలాడుకోరు. ఎలా మేనేజ్ చేస్తున్నావు నీవు'' కుతూహలంగా అడిగాడు శర్మ.

"అదే చెపుతున్నాను విను. ఒక సారి నా పెళ్ళికాక ముందు మా చెల్లెలు మా అమ్మతో వాళ్ళ అత్తగారి గురించి కంప్లైంట్ చేస్తోంది. మా అత్తగారు వొట్టి కుళ్ళుమోతమ్మా. మేమిద్దరం సరదాగా వుంటే చూడలేదు. ఎక్కడికన్నా వెడితే కళ్ళల్లో నిప్పులు పోసుకుంటుంది. ప్రతిదానికి నేనున్నానంటూ నా కంటె ముందు కొడుక్కి కాఫీ, భోజనం అన్నీ తనే పెట్టాలనే చూస్తుంది. ఏం నా మొగుడికి నేను పెట్టుకోలేనా మధ్యలో

అవిడ ఎందుకు రావాలి'' అంటూ ఏదో చెప్తుంది.

''బావుండే యీ రోజంటే నీవు వెళ్ళావు. పాతికేళ్ళు పెంచిన తల్లి ఒక్కసారిగా కొడుకు మీద మమకారం చంపేసుకుంటుందా ఏమిటి, పెళ్ళాం వచ్చిందని తన చేత్తో కొడిక్కి అన్నం పెట్టుకోవాలని ఆవిడకి మాత్రం అనిపించదా ఏమిటి. ఒసే రేపు నీకో కొడుకు పుట్టి ఆ కొడుక్కి పెళ్ళయితే గాని ఆ బాధ అర్థం కాదే. మీరిద్దరూ అన్యోన్యంగా వున్నారన్న బాధ కాదు అది. కొడుకు తన ఉనికి ఒక్కసారిగా మర్చిపోయాడన్న బాధ అది. ఇన్నాళ్ళూ 'అమ్మా కాఫీ. అమ్మా టిఫిను' అనేవాడు ఒక్క రోజులో, 'పద్మా కాఫీ, పద్మ అన్నం' అంటే ఆవిడ యీ మార్పుకి అలవాటు పడడానికి కొన్నాళ్ళు పడ్తుంది. అమ్మ అనునయంగా నచ్చచెప్తోంది. మా చెల్లెలు మూతి ముడుచుకుని, 'బాగుంది. అయితే కొడుక్కి పెళ్ళి చేయకపోతే ఆవిడ కొంగు పట్టుకునే తిరుగుతాడు'గా అంది. మా అమ్మ నవ్వి ఈనాడు నేనేం చెప్పినా నీకర్థం కాదు నీవు ఓ అత్తగారయిన నాడు అర్థం అవుతుంది,'' అంది.

వాళ్ళ మాటలు వింటున్న నాకు ఓ సత్యం బోధపడింది. రేపు పొద్దున్న నా పెళ్ళయితే మా అమ్మ అలాగే ఫీలవుతుందన్న మాట. రేపు నా భార్య, నా తల్లీ యిలాగే కొట్టుకుంటారా. యిద్దరి మధ్య నేను నలుగుతూ యిల్లు నరకం అవుతూంటే చూస్తూ వూరుకోవల్సిందేనా....ఏదో చెయ్యాలి. ఆ పరిస్థితి రాకుండా, విభేదాలు రాక ముందే అరికట్టాలి అనుకున్నాను. ఎలా? ఏం చెయ్యాలి? అమ్మ మా యింట్లో వుండేదే. నాల్గు రోజులు వుండి పోయేదయితే ఎలాగో సర్దుకో వచ్చు. రోజూ అత్తా కోడలు యిద్దరూ సఖ్యంగా వుండాలంటే ఏం చెయ్యాలి....అత్త కోడలంటే బద్ధ శత్రువులు కాదు. కొడుక్కి యిద్దరూ కావల్సిన వారే అని తెలియచెప్పడం ఎలా? చాలా ఆలోచించాను...''

''ఏం చేశావు. ఏం చెప్పావు యిద్దరికి....'' ఆరాటంగా అడిగాడు శర్మ.

''నా పెళ్ళయిన వారం రోజుల్లోనే మా ఆవిడతో ఫ్రాంక్‌గా నా అభిప్రాయం చెప్పాను. యింట్లో శాంతి సామరస్యాలు వుండాలంటే ముగ్గురు మధ్య పరస్పర అవగాహన వుండాలి అని చెప్పడం ఆరంభించాను...''ఏం నేను రాంగానే అత్తగారిని యింట్లోంచి పంపించి వేస్తానని భయపడ్తున్నారా...'' సునంద నవ్వి అంది.

''యింట్లోంచి పంపించేస్తే లోకానికి తెలుస్తుంది-అలా కాకుండా యింట్లో సాధించి వేధించి ప్రాణాలు పోకుండా తడిగుడ్డతో గొంతులు కోసే అత్తగార్లున్నారు, కోడళ్ళున్నారు.'' నవ్వాను నేను. సునంద మొహం ముడుచుకుంది. ''అలాంటి వారితో జమ చేస్తున్నారన్నమాట నన్ను,'' అంది. సునందని ప్రేమగా దగ్గిరకి తీసుకున్నాను.

''సునందా నీవు వచ్చి నాలుగు రోజులయింది....మనం ముగ్గురం ఒక యింట్లో కల్సి బతకాల్సిన రోజులు యింకా కొన్ని వందల నాల్గులుండవచ్చు...''

''నన్నేం చేయమంటారో చెప్పండి ఫ్రాంక్‌గా, యీ ఉపోద్ఘాతాలు ఎందుకు?'' అంది.

''అదే చెపుతున్నాను. సునందా ఒక్క విషయం ఎప్పుడూ మర్చిపోకు. భార్యగా నా హృదయంలో నీ స్థానం ప్రథమ స్థానమే. అయితే నన్ను కని పెంచిన తల్లిగా, నాన్నగారు లేని యింట్లో కొడుకు దగ్గరే వుండాల్సిన ఆవిడకి యీ యింట్లో స్థానం వుందని మరవకు. యిది నా మొగుడిల్లు, నా యిల్లు అని నీకనిపించవచ్చు, కాని పాతికేళ్ళుగా ఆవిడ ఈ యింటిని చక్కదిద్దింది - నన్ను కంటికి రెప్పలా కాచుకుంది. ప్రతి తల్లీ ప్రతి కొడుక్కి యింతా చేస్తుంది కాదనను... పెళ్ళి కాగానే భార్యాభర్తల మధ్య ఆవిడ జోక్యం ఎందుకు అనీ నీకన్పించవచ్చు. పెద్దావిడని కృష్ణా రామా అనుకుంటూ మూల కూర్చోమనండి, తిండి పెట్టమా యింట్లోంచి తరిమేస్తామా అని నీవడగ వచ్చు...కేవలం తిండిబట్టతో తృప్తిపడడానికి ఆవిడ ఏడబ్బిచ్చో పెట్టుకున్న వంటమనిషి, పనిమనిషి కాదు. ఆవిడకి ఈ యింట్లో కొద్దో గొప్పో గౌరవం, విలువా యిస్తారని ఆవిడ అనుకోవాలి-అప్పుడు ఆవిడ తన పెద్దరికాన్ని నిలుపుకోడానికి ప్రయత్నిస్తుంది....

శీతాఫలం ఆకు రసం తీసి, అందులో నువ్వులనూనె ఒక స్పూను కలిపి, గజ్జి కురుపులు మీద రాస్తే యిట్టే తగ్గిపోతాయి. వేపనూనె కలుపుకుంటే మరీ మంచిది. గజ్జి కురుపులు త్వరగా మాడిపోతాయి.

—మల్లిడి కనకరత్నం, ఆటపాక

''ఇంతకీ నన్నేం చేయమంటారు అది చెప్పండి.''

''చూడు సునందా...ఓ ఆడదాని, అందులో అత్తగారి మనస్తత్వం ఎలా వుంటుందో కాస్త ఆలోచించడానికి ప్రయత్నించు. నిన్నటివరకు అన్నింటికి అమ్మ మీద ఆధారపడ్డాను. ఈ రోజు హఠాత్తుగా నీవు రాగానే అమ్మ ఉనికినే మరచి పోయినట్లు 'సునందా కాఫీ, సునందా అన్నం పెట్టు, సునందా నా బట్టలేవి' అంటూ నీ మీద ఆధారపడడం ఆరంభించగానే హఠాత్తుగా యీ మార్పుకి ఆవిడా అలవాటు పడాలి. కొడుక్కింక తన అవసరం లేదు, కోడలు రాగానే తనకి పరాయివాడయి పోయారు అన్న బాధ మొదలవుతుంది.

''అందులో ఏం వింత వుంది. ఆవిడ పెళ్ళయ్యాక ఆవిడ భర్తకి కావల్సినవి ఆవిడ చూసుకోలేదా? యీ రోజు కోడలు చేస్తే ఎందుకు ఫీలవాలి.''

''అదేగా నేను చెప్పేది. ఓ కోడలు అత్త అయ్యేసరికి, తనూ ఓ నాడు ఓ కోడలు అన్న మాట మర్చిపోతుంది ఆడది. తర తరాలుగా అత్త కోడళ్ళ మధ్య అభిప్రాయ భేదాలు రావడానికి కారణం హఠాత్తుగా కొడుకు తనకి దూరమయ్యాడన్న బాధ. అలా కాకుండా కొడుకు పెళ్ళయినా మారిపోలేదు. అన్న భావన ఆవిడకి కలిగిస్తే కోడలి పట్ల అసూయా ద్వేషాలు ఆమెకి కలగవు. కేవలం నోటిమాటలతో చిన్న చిన్న చాతలతో ఆవిడ హృదయాన్ని గెల్చుకోడం నీ చేతుల్లో పని. ఒకసారి గనక ఆవిడని గెల్చుకున్నావంటే నిన్ను నెత్తిమీద పెట్టుకుంటుంది ఆవిడ.''

''మహా ఏదో పెద్ద ఎక్స్‌పీరియన్స్ వున్నట్టు ఘంటాపథంగా చెప్తున్నారే. ఇంతకీ తమ తల్లిగారి అనుగ్రహ పాత్రురాలవడానికి నేనే సేవలు చెయ్యాలో సెలవివ్వండి'' అంది సునంద హాస్యంగా.

''సేవలు, పూజలు అక్కర్లేదోయి. ఒక్క నెల రోజు నేనేం చేసినా, నేనేం అంటున్నా నీవు అపార్థం చేసుకోకుండా ఓర్పు పట్టాలి. అప్పుడు చూడు ఈవిడ అత్తా, అమ్మా అన్న అనుమానం వచ్చి నీవే ఆశ్చర్యపోతావు.''

''ఇంతకీ తమరేం చెయ్యబోతున్నారు. అత్తా కోడళ్ళ చరిత్ర మార్చేసే ఆ మహా మంత్రం త్వరగా ఉపదేశించండి.''

[ముగింపు వచ్చే సంచికలో]